# ఇండియన్ ఎకానమీ

## ఆర్థిక వృద్ధి - సూచికలు

**లోరెంజ్ వక్రరేఖ**

అమెరికన్ ఆర్థికవేత్త మాక్స్ లోరెంజ్ 1905లో ఈ వక్రరేఖ ద్వారా ఆదాయ అసమానతలు, సంపద పంపిణీలో అసమానతలను వివరించారు. జనాభా, ఆదాయం లేదా సంపద పంపిణీల మధ్య సంబంధాన్ని రేఖాత్మకంగా వివరించారు.

45° సంపూర్ణ సమానత్వ రేఖ ఆదాయం, జనాభాల మధ్య సంపూర్ణ సమానత్వాన్ని తెలుపుతుంది. సంపూర్ణ సమానత్వ రేఖ దిగువనున్న లోరెంజ్ వక్రరేఖ సంపద లేదా ఆదాయ పంపిణీ అసమానత్వాన్ని తెలుపుతుంది. అంటే 45° సంపూర్ణ సమానత్వ రేఖ దాని దిగువనున్న లోరెంజ్ వక్రరేఖ మధ్య ప్రాంతం ఆదాయం, సంపద పంపిణీల్లోని అసమానత్వాన్ని సూచిస్తుంది. అయితే ఆదాయ అసమానతలు ఎంత మేరకు ఉన్నాయనేది 'గిని గుణకం' ద్వారా తెలుసుకోవచ్చు.

**గిని గుణకం (Gini Coefficient):**

ఇటలీ దేశానికి చెందిన గణాంక, సామాజికవేత్త 'కొరాడో గిని'. ఈయన 'గిని గుణకాన్ని' అభివృద్ధి చేశారు. ఈ గుణకం విలువ '0' నుంచి '1' మధ్య ఉంటుంది. దీనిలో 'సున్నా' అనేది సంపూర్ణ సమానత్వాన్ని తెలియజేస్తుంది. అంటే జనాభా, ఆదాయం మధ్య సంపూర్ణ సమానత్వం ఉందని అర్థం. దీని విలువ 'ఒకటి' అయితే జనాభా, ఆదాయం మధ్య సంపూర్ణ అసమానత్వం ఉందని అర్థం. అయితే '0' నుంచి '1' మధ్య విలువలు ఆయా దేశాల ఆదాయ, సంపద పంపిణీల్లో అసమానతలను తెలుపుతాయి. దీనికి అనుగుణంగా A/A+B అనే సమీకరణాన్ని తయారు చేశారు. దీనిలో 'A' అనేది లోరెంజ్ పటంలో ఆదాయ సమానత్వ 45° రేఖకు, లోరెంజ్ వక్రరేఖకు మధ్య ఉన్న ప్రాంతాన్ని సూచిస్తుంది. 'B' అనేది లోరెంజ్ వక్రరేఖకు దిగువనున్న ప్రాంతాన్ని సూచిస్తుంది. దీన్ని కింది పటం ద్వారా మరింత విపులంగా అర్థం చేసుకోవచ్చు.

**లోరెంజ్ వక్రరేఖ, గిని గుణకం**




గిని గుణకం

$$= \frac{A}{A + B}$$

**ఫిలిప్స్ వక్రరేఖ**

ఎ.డబ్ల్యూ. ఫిలిప్స్ ప్రతిపాదించిన వక్రరేఖ ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత మధ్య విలోమ సంబంధం ఉంటుందని తెలియజేస్తుంది. ఆర్థికవృద్ధితో సంభవించిన ద్రవ్యోల్బణం అధిక ధరలకు, లాభాలు అధిక ఉద్యోగాల కల్పనకు దారితీస్తాయని ప్రతిపాదించారు. అయితే 1970 దశాబ్దంలో స్టాగ్ ఫ్లేషన్ సంభవించడం వల్ల ద్రవ్యోల్బణంతో పాటు అధిక నిరుద్యోగిత సంభవించింది.






R-10-11-18

## వివిధ రంగాల వారీ వృద్ధిరేట్ల విశ్లేషణ

- వ్యవసాయం, అనుబంధ రంగాలు అంటే వివిధ పంటలు, లైవ్ స్టాక్ అంటే కోళ్ల పెంపకం, పశుగణాభివృద్ధి (మేకలు, గొర్రెలు, గేదెలు సహా), అడవులు, అటవీ వృత్తులు, చేపల పెంపకం, గుడ్ల పరిశ్రమ మొదలైనవి. జీడీపీలో వ్యవసాయ రంగం వాటా 17% వరకు ఉంది.
- ప్రస్తుత గణాంకాల ప్రకారం 2017-18లో భారతదేశం సాధించిన జీడీపీ (GDP) వృద్ధిరేటు 6.7%. 2018-19 జీడీపీ వృద్ధి రేటును భారతీయ రిజర్వ్ బ్యాంక్ 7.4%గా, ప్రపంచ బ్యాంక్ 7.3%గా అంచనా వేశాయి.

### వ్యవసాయం, అనుబంధ రంగాలు

- జీవీఏలో (గ్రాస్ వాల్యూ యాడెడ్) వ్యవసాయం, అనుబంధ రంగాల వాటా 2012-13లో 18.2% ఉంటే 2017-18 మొదటి ముందస్తు అంచనాల ప్రకారం 16.4 శాతానికి క్షీణించింది. 2011-12లో పంటల వాటా 65% ఉంటే 2015-16కి 60 శాతానికి క్షీణించింది. 2012-13లో 1.5% ఉన్న వ్యవసాయ అనుబంధ రంగాల వృద్ధిరేటు 2016-17 నాటికి 4.9%గా నమోదైంది. స్థూల మూలధన సంచయనం (GCF) GVA లో 2011-12లో 18.2% ఉంటే 2015-16లో 16.4% ఉంది.

### పారిశ్రామిక రంగం

- జీవీఏలో పారిశ్రామిక రంగం వాటా 31.2% ఉంది. 2017-18 (ఏప్రిల్ - నవంబరు)లో పారిశ్రామికోత్పత్తి 3.2% వృద్ధి చెందింది. పారిశ్రామికోత్పత్తి సూచీలో (IIP) 40% వరకు భారత్వం (Weightage) ఉన్న ఎనిమిది కీలక (core) రంగాలైన బొగ్గు, ముడిచమురు, సహజవాయువు, పెట్రోలియం రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, తయారైన ఉక్కు, సిమెంట్, విద్యుచ్ఛక్తి వృద్ధిరేటు 2017-18లో 3.9% ఉంది. (ఏప్రిల్ - నవంబరు మధ్య) జీవీఏలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (MSME) పరిశ్రమల వాటా 32% ఉంది.

### సేవల రంగం

- జీవీఏలో సేవల రంగం వాటా 55.2% గా ఉంది. సేవల రంగం వృద్ధిరేటు 2016-17లో 7.7%గా మొదటి ముందస్తు అంచనాల్లో 2017-18లో 8.3%గా పేర్కొన్నారు. సేవల రంగం జీవీఏ వాటాలో 32 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో దిల్లీ, చండీగఢ్ 80% వాటా పొందగా, సిక్కిం 31.7% వాటాతో దిగువ స్థానంలో ఉంది. ఈ-కామర్స్ మార్కెట్ 19.1% వృద్ధితో 2016-17లో 33 బిలియన్ డాలర్ల విలువ నమోదు చేసుకుంది. 2015-16 జీవీఏలో రియల్ ఎస్టేట్ రంగంలో నమోదైన వృద్ధి 7.7%. సాంఘిక సేవల రంగంలో 2015-16లో 5.8% వృద్ధి, 2017-18 బడ్జెట్ అంచనాల్లో 6.6% వృద్ధి నమోదయ్యాయి. జీడీపీలో మొత్తం వ్యయంలో సామాజిక సేవలపై వ్యయ శాతం కింది విధంగా ఉంది.

| | జీడీపీలో శాతం 2017-18 (బడ్జెట్ అంచనాలు) |
|---|---|
| సామాజిక సేవలపై మొత్తం వ్యయం | 26.4% |
| ✪ విద్య | 2.7% |
| ✪ ఆరోగ్యం | 1.4% |
| ✪ ఇతర సేవలు | 2.6% |

**రచయిత: దాడి నారాయణరావు**